క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



నెక్కొండ: ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల్లో పట్టుదల ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం జాతీయ స్థాయిలో రాణిస్తారని నెక్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగారావు అన్నారు. పాఠశాలలో పదో తరగతి చదివిన భట్టు నిఖిల్‌వర్మ రేపు (బుధవారం) మద్రాసు ఐఐటీలో జరిగే స్టాక్ హోమ్ జూనియర్ వాటర్ ప్రైజ్ ఇండియా (ఎస్‌జేడబ్ల్యూపీ) ఫైనల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. ఈసందర్భంగా భట్టు నిఖిల్‌వర్మను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈ పోటీల్లో విజయం సాధిస్తే ఆగస్టు 24నుంచి 29వరకు స్టాక్ హోమ్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ పూస కిషోర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామికి లక్ష పుష్పార్చన



గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలి గ్రామంలోని ప్రసిద్ధ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి మల్లె పూలతో లక్ష పుష్పార్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

గీసుకొండ : మండలంలోని జాన్‌పీరీలు (ఆదర్శనగర్)కు చెందిన వివాహిత ఎనుక తులసి (24) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. ఎనుక తులసి, రవి ప్రేమించి వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. రవి ప్రతిరోజూ ఆలస్యంగా ఇంటికి వస్తుండడంతో కొద్ది రోజులుగా దంపతుల నడుమ తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో రవి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి బయటకు వెళ్లగా ఈనెల 31న తులసి ఇంట్లోనే ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. బంధువులు, స్థానికులు ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాగి మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై పాడి గేదె..



చెన్నారావుపేట : విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని జల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంద రమేశ్ సాకుతున్న పాడి గేదె గ్రామ శివారులోని బంధం కుంట ప్రాంతంలో మేత మేస్తుండగా ఇటీవల వీచిన గాలిదుమారానికి తెగిపడిన విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు రమేశ్ వాపోయాడు. మృతి చెందిన పాడి గేదెను డాక్టర్ మంజీలాల్, విద్యుత్ అధికారులు పరిశీలించారు.

బీజేపీ నాయకుల హర్షం



దుగ్గొండి : కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంతో బీజేపీ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని గిర్నిబావిలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు బుసాని రమేశ్, ఏరుకొండ కరుణాకర్, అన్నలింగన్న, రాజేందర్, రమేశ్, కుమారస్వామి, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంబురాలు

నర్సంపేట : ఏపీలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విజయం సాధించగా పట్టణంలోని వరంగల్ రోడ్డు జంక్షన్‌లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు శివకోటి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో నాయకులు వంగ మధు, ఓర్సు రాజేందర్, బొబ్బ పృథ్వీరాజ్, రొడ్డ శ్రీకాంత్, షేక్ హుస్సేన్, మిలాన్, గంగుల రంజిత్, డేవిడ్, నాగరాజు, పోషాల కార్తీక్, రాపోలు సురేశ్, శ్యామ్, నవజీవన్ పాల్గొన్నారు.

దుగ్గొండి : గిర్నిబావిలో బాణసంచా పేల్చుతున్న నాయకులు



నల్లబెల్లి : సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన

దుగ్గొండి : కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాం నాయక్ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మండలవ్యాప్తంగా ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. గిర్నిబావిలో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని చెప్పారు. ఎంపీగా బలరాంనాయక్ అఖండ విజయం సాధించడం ప్రజాదరణకు నిదర్శమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రల్ల బాబు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, దంజ్యానాయక్, దంజ్యా, మాదాసి సాంబయ్య, జయరామ్, తిరుపతిరెడ్డి, ఎడెల్లి శ్రీనివాసరెడ్డి, అమ్మ రోహిత్, కోరె రాజేశ్, కొలుగూరి కరుణాకర్, పెండ్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బాణసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి మాట్లాడారు. బలరాంనాయక్‌ను గెలిపించినందుకు శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు బండి శివకుమార్, సింగం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : అంబేడ్కర్ సెంటర్‌లో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మంద యాకయ్య మాట్లాడారు. ఎంపీగా బలరాంనాయక్ గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్, కుండె కుమారస్వామి, బండి హరీశ్, బొంత శ్రీను, రాజు, ఈర్య నాయక్, వీరయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, ఎర్రబెల్లి రఘుపతిరావు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ చరణ్‌సింగ్, నాయకులు పురుషోత్తం సురేశ్, తేజావత్ సమ్మయ్య నాయక్, బత్తి మల్లయ్య, బత్తిని మహేశ్, ద్యాగల రాజేశ్, తిరుపతి, బేతి భరత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : వరంగల్ ఎంపీగా కడియం కావ్య ఘన విజయం సాధించడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాయకత్వంలో పరకాల నియోజకవర్గంలో కడియం కావ్యకు 32 వేల మెజారిటీ ఇచ్చారని తెలిపారు. ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరగోని రాజ్‌కుమార్, దొడు ప్రవీణ్ , కార్యకర్తలు పాల్గొన్నారు.



చెన్నారావుపేటలో..

సంగెం : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, నాయకులు జగన్నాథచారి, ఆగపాటి రాజు, కావటి వెంకటయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండలో..



సంగెంలో..

మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు



పూర్ణాహుతిలో పాల్గొన్న ఈఓ, అర్చకులు



పట్నం వేసి పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం ఉదయం నిత్యపూజల అనంతరం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు స్వామివారికి ఎదురుగా నజరు పట్నం వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, వేద పండితుడు గట్టు పురుషోత్తమ శర్మ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తి పై కేసు

ఖిలా వరంగల్ : ఒకరిపై దాడి చేసిన నేపథ్యంలో కె.హరీశ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన మీడియాకు మంగళవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని తూర్పుకోటకు చెందిన జి.వెంకన్న దూపకుంట రోడ్డులోని మై మాస్టర్ హైస్కూల్ సమీపంలోని తన వ్యవసాయ భూమిలో దుక్కి దున్నుతుండగా హరీశ్ అక్కడకు చేరుకుని వాగ్వాదానికి దిగాడు. నాంద్రె రాజు అనే వ్యక్తి అతడి కూతురు శారీ ఫంక్షన్‌కు తనను పిలువమని చెప్పినా పిలువలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంకన్న తలపై హరీష్ కర్రతో కొట్టగా తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రున్ని వెంటనే స్థానిక రైతులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వెంకన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

హన్మకొండ చౌరస్తా : డయాబెటిక్, గుండె సంబంధిత వ్యాధులపై హనుమకొండ చౌరస్తా సమీపంలోని పద్మాక్షి పాలిక్లినిక్‌లో నేడు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని ఆ ఆస్పత్రి యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. శిబిరంలో ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ లక్ష్మణ్ కుమార్ డయాబెటిక్, థైరాయిడ్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ అనిల్‌కుమార్ పాల్గొని పరీక్షలు, చికిత్స చేస్తారని పేర్కొన్నారు. క్యాంపు ద్వారా సుమారు రూ. 5వేల విలువైన కాలేయ కొవ్వు స్థాయిని గుర్తించే ఫైబ్రో స్కాన్, కాళ్ల మంటలు, కాళ్ల నరాలకు సంబంధించిన న్యూరోపతి స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. 99559 96166, 91338 93360 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

7,390 ఓట్ల మెజారిటీ

దుగ్గొండి : మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలో మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవితపై 7 వేల 390 ఓట్ల మెజారిటీ సాధించారు. బలరాంనాయక్‌కు 15 వేల 632 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థికి 8 వేల 242, బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్‌కు 3 వేల 876 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ సాధించడంతో మండలంలో శ్రేణుల్లో జోష్ కనబడుతోంది. పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన దొంతి మాధవరెడ్డికి 15 వేల 328 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డికి 15 వేల 302 ఓట్లు పోలయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 8 వేల 242 ఓట్లకే పరిమితమవగా కాంగ్రెస్ మాత్రం మరో 300 ఓట్లు పెంచుకుని 15 వేల 632 సాధించింది.

తాగునీటికి తండ్లాట

ఖిలా వరంగల్ : వేసవి ఎండ, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాగుదామంటే నీటి చుక్క దొరకని పరిస్థితి. ప్రధానంగా వరంగల్ 43వ డివిజన్ గణేశ్‌నగర్ కాలనీలో ప్రజలు తాగు నీటి కోసం తల్లడిల్లుతున్నారు. పైపులైన్లు ఉన్నా తాగునీరు సరఫరా లేక నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై ఏఈ, డీఈ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టింపు లేదని స్థానికులు చెబుతున్నారు. పరిష్కారం కోసం మొదటిసారి ఫోన్ చేస్తే స్పందన కరువు. రెండో సారి కాల్ చేస్తే స్విచ్చాఫ్ చేస్తున్నారన్నారు. కాలనీలో బోర్లు, బావులు అడుగంటి పోయాయని, తాగునీరు సరఫరా చేయాలని 43వ డివిజన్ కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా సమాధానం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పైపులైన్ ద్వారా సరఫరా లేక గుక్కెడు నీటి కోసం ఇక్కట్లు పడుతున్నామని వాపోయారు. దూరప్రాంతం నుంచి రూ.20లు పెట్టి ప్రైవేట్‌గా మినరల్ వాటర్ తెచ్చుకుని గొంత తడుపుకుంటున్నామని వాపోతున్నారు. ఇకనైనా బల్దియా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్ల పక్కనే చెత్త, వ్యర్థాలు

కాజీపేట : పట్టణంలోని అనేక ప్రాంతాల్లోన్లి అంతర్గత రహదారుల పక్కన కొందరు బహిరంగంగా చెత్త, ఇతర వ్యర్థాలు పారబోస్తుండడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలపై కవర్లలో చెత్త తీసుకొచ్చి వేస్తున్నారని స్థానికులు మీడియా ఎదుట వాపోయారు. ఇంటి వద్దకు నిత్యం చెత్త తరలింపు వాహనాలు వస్తున్నా కొందరు పరిసర ప్రాంతా లను అధ్వాన్నంగా మారుస్తున్నారని వాపోతున్నారు. పరిశుభ్రంగా ఉంచేందుకు కార్పొరేటర్లు, స్థానిక అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నా కొందరు చెత్తవేస్తుండటం దారుణమని అంటున్నారు. అధికారులు రహదారుల చెంత నిఘా పెట్టి ఇటువంటి వారిపై భారీగా జరిమానాలు విధిస్తే మిగతావారు భయపడతారని కాలనీవాసులు చెబుతున్నారు. పట్టణంలోని చైతన్యపురి కాలనీ, ప్యారడైజ్ ఫంక్షన్, కడిపికొండ బ్రిడ్జి కింద, డీజిల్‌కాలనీ శివారు, సోమిడి, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో రోడ్ల పక్కన చెత్త వేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చెత్త వేస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల అభివృద్ధి కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఈ విషయాన్ని సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా చెత్తవేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కడిపికొండ బ్రిడ్జి కింద ఉన్న చెత్తాచెదారం

పనులు త్వరగా పూర్తి చేయాలి



గంగారం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ రామారావు అన్నారు. మండలంలోని వెంకమ్మగుంపు, గుడిపాడు, బావురుగొండ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నీతి అయోగ్ జిల్లా ప్రత్యేకాధికారి శ్రీనాథ్, ఏఈ శోభన్, ఎంఈఓ శ్రీదేవి, సీఆర్‌పీలు గిరిబాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు.. పట్టించుకోరా?



ప్రమాదకరంగా ఉన్న కమలాపురం క్రాస్ రోడ్డు..

కమలాపురం క్రాస్‌లో దుస్థితి
- స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలూ కరువే
- పోలీస్, ఎన్‌హెచ్ శాఖల నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణ శివారులోని కమలా పురం క్రాస్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..? అన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి. కమలాపురం క్రాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ప్రమాదాల నివారణ కోసం స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలూ ఏర్పాటు చేసి దాఖలాల్లేవు. పోలీస్, ఎన్‌హెచ్ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే అపవాదు ఉంది.

నర్సంపేట పట్టణ శివారులోని కమలాపురం క్రాస్ రోడ్డు 365వ నంబర్ జాతీయ రహదారిపై ఎలాంటి మూలమలుపు లేకుండా ఉంది. ఈ క్రమంలో వాహనాలు పూర్తి స్పీడ్‌తో రావడం పరిపాటిగా మారింది. అయితే కమలాపురం క్రాస్ రోడ్డుకు రాగానే వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. కమలాపురం క్రాస్ రోడ్డు సమీపంలోనే వైన్ షాపు సైతం ఉంది. పలువురు మందు బాబులు వైన్ షాపు వద్ద మద్యం సేవించి బయల్దేరుతుండడంతో సైతం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కమలాపురం గ్రామం నుంచి జాతీయ రహదారిపై ఒక్కసారిగా వాహనాలు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలోనూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్ని నెలల క్రితం వరంగల్ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న వాహనం కమలాపురం క్రాస్ రోడ్డు వద్దే స్కూల్ పిల్లల వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం అనేక ప్రమాదాలూ చోటు చేసుకున్నాయి. అయినా జాతీయ రహదారుల (ఎన్‌హెచ్), పోలీసు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి కమలాపురం క్రాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

నర్సంపేట : పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య, రాష్ట్ర సెక్రటరీ ఎలిగేటి భాస్కర్ డిమాండ్ చేశారు. డీబీఆర్‌పీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న పేదలకు మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాంబయ్య, భాస్కర్ మాట్లాడారు. ప్రభుత్వ భూములు కబ్జా గురవుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. పేదలకు ప్రభుత్వ భూములను పంచే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు, జిల్లా నాయకుడు రాపర్తి జగన్నాథం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్, మండల ఇన్‌చార్జ్ కందగడ్ల సురేశ్, మహిళా సంఘం నాయకులు అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, రజిత, సుజాత, అరుణ, మానస, కోమల తదితరులు పాల్గొన్నారు.



గుడిసెవాసులతో మాట్లాడుతున్న సాంబయ్య

వరంగల్ ఎంపీగా పర్వతగిరి బిడ్డ

- లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్య ఘన విజయం
- మండల కేంద్రంలో సంబురాలు..

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్య వరంగల్ ఎంపీగా ఘన విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికల్లో సమీప అభ్యర్థి (బీజేపీ) అరూరి రమేశ్‌పై రెండు లక్షలపై చిలుకు మెజార్టీతో గెలుపొందారు. దీంతో మండల కేంద్రంలో సంబురాలు అంబరాన్నంటాయి. కడియం శ్రీహరి తండ్రి లక్ష్మినారాయణ. శ్రీహరి పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉన్నత చదువు కోసం హనుకొండలో స్థిరపడ్డాడు. కడియం శ్రీహరికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇందులో కావ్య పెద్ద కూతురు. కావ్య.. తండ్రి శ్రీహరితో కలిసి హనుకొండలో నివాసం ఉంటోంది. కాగా పలు రాజకీయ పార్టీల నాయకులు కడియం శ్రీహరి స్వగ్రామం పర్వతగిరి కాదని విమర్శించేవారు. అయితే కడియం శ్రీహరి.. పర్వతగిరిలో జరిగిన సమావేశంలో తాను పుట్టి పెరిగిన గడ్డ పర్వతగిరి అని ప్రతిపక్షాలకు ఘాటు సమాధానం చెప్పారు.

రాజకీయ జన్మనిచ్చిన పర్వతగిరి..

కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, కడియం కావ్య, ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు పర్వతగిరి గడ్డ రాజకీయ జన్మనిచ్చింది. పర్వతగిరిలో పుట్టిన నాయకులు ఉన్నత స్థాయిలో ఉంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



పర్వతగిరిలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌కుమార్

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్

మామునూరు : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్ కుమార్, సీఐ రవికుమార్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో ఈనెల 1 ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం నాలుగో రోజుకు చేరుకోగా ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలతో సమాజంలో అనేక అవకతవకలు పాల్పడి ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్న విధానం, సాంకేతికతను తప్పుగా వాడి సమాజాన్ని భయభ్రాంతులను గురి చేస్తున్నాయని వివరించారు. సైబర్ నేరాలపై ఏమైనా అనుకోని ఘటనలు ఎదురైతే సైబర్ పోలీసులను వెంటనే సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కమాండెంట్ రవికుమార్, డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకర్, లెఫ్టినెంట్ స్వప్న, రమణా, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, సిబ్బంది, కేడెట్లు పాల్గొన్నారు.